అక్రమాల గుట్టు రట్టయ్యేనా?

- రేకుర్తిలో రెవెన్యూ సర్వే
- కబ్జాకు గురైన స్థలాల వివరాలు సేకరించిన అధికారులు

కార్పొరేషన్, జూలై 11: ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు, అనుమతుల్లేకుండా ఇండ్ల నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాల కబ్జాకు గురయ్యాయని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు కదిలిరారు. గురువారం రేకుర్తిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇందులో భాగంగా సర్వేను చేపట్టారు. అయితే అక్రమాలు బయటకు వస్తాయా? లేదా? కబ్జాదారుల కబంధ హస్తాల్లోని భూములకు విముక్తి లభిస్తుందా? లేదంటే తూతు మంత్రంగా సర్వే చేపట్టి మమ అనిపిస్తారా? అన్న చర్చ జోరుగా సాగుతున్నది. గతంలోనూ విచారణలు, సర్వే చేపట్టినా ఒనగూరిందేమీలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం చేపట్టిన సర్వేపైకూడా అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి.

రేకుర్తిలో సర్వే చేస్తున్న అధికారులు

అధికారులు, ప్రజాప్రతినిధుల కుమ్మక్కు..

రేకుర్తిలో చాలా స్థలాల్లో ఎలాంటి ఇంటి నిర్మాణాలు లేకుండానే నగరపాలక రెవెన్యూ అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు కలిసి ఇంటి నంబర్లు కేటాయించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. పోలీసులకు కూడా పెద్ద మొత్తంలో ఫిర్యాదులు అందాయి. విచారించిన పోలీసులు ఇద్దరు బల్దియాకు చెందిన ఆర్ఐలను అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంతో నగరపాలక సంస్థలో పెను దుమారం రేగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా తర్వాత కూడా ఫిర్యాదులు వచ్చాయి. స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో పూర్తిస్థాయిలో ప్రభుత్వ స్థలాలు, ఇంటి నంబర్ల కేటాయింపులు, అనుమతి లేని ఇండ్ల నిర్మాణాలపై ప్రత్యేక సర్వే చేస్తున్నారు. కాగా, బల్దియాలోని టౌన్ ప్లానింగ్ విభాగంలోని పలువురు అధికారులు ఈ అక్రమ నిర్మాణాలకు వంత పాడారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుత సర్వేలో అక్రమాలు బయటపడితే బాధ్యులైన అధికారులు, ఉద్యోగులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారోనన్న చర్చ కరీంనగర్ బల్దియా వర్గాల్లో జోరుగా సాగుతున్నది.

నవాబ్ అలీ జంగ్ సేవలు చిరస్మరణీయం

నవాబ్ అలీ జంగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, జూలై 11: ఇంజినీర్‌గా చరిత్ర ప్రఖ్యాతిగాంచిన కట్టడాలు నిర్మించి తెలంగాణ ఖ్యాతిని ఇనుమడింపజేసిన నవాబ్ అలీ జంగ్ సేవలు చిరస్మరణీయమని మేయర్ యాదగిరి సునీల్‌రావు కొనియాడారు. ఆయన జయంతి (తెలంగాణ ఇంజనీర్స్ డే) వేడుకలను కరీంనగర్ బల్దియా ఆఫీసులో గురువారం ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధునిక టెక్నాలజీ లేకున్నా పెద్ద పెద్ద ప్రాజెక్టులు, కట్టడాల నిర్మాణంలో కీలకభూమిక పోషించారన్నారు. హైదరాబాద్‌ను మహానగరంగా తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. సుందర కరీంనగర్ నిర్మాణంలోనూ ఇంజినీర్ల పాత్ర వెలకట్టలేనిదని పేర్కొన్నారు.ఇందులో నగర ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్లు నాంపల్లి శ్రీనివాస్, ఎదుర్ల రాజశేఖర్, ఎస్ఈ మహేందర్, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ గట్టు స్వామి, గంగాధర్, గఫూర్ అలీ, ఆర్వో ఉన్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

- బెదిరి ఎల్ ఎండీలో మునిగి 30 జీవాల మృతి

గన్నేరువరం, జూలై 11: గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో బెదిరిన గొర్రెలు ఎల్ఎండీలో నీట మునిగి మరణించాయి. గన్నేరువరం మండలం మైలారానికి చెందిన మర్రి తిరుపతి, పేరం ముత్తయ్య, మడికంటి అశోక్ సుమారు 200 తమ గొర్రెలను గురువారం మేత కోసం ఎల్ఎండీ గట్టుకు తీసుకెళ్లారు. మధ్యాహ్నం గొర్రెల కాపారులు భోజనం చేస్తున్న సమయంలో కుక్కల గుంపు గొర్రెల మందపై దాడి చేసింది. బెదిరిన సుమారు 100 జీవాలు లోయర్ మానేర్ డ్యాం నీళ్లలో దూకాయి. ఇందులో 30 గొర్రెలు నీటమునిగి మరణించాయి. రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని గొర్రెల కాపారులు కంటతడిపెట్టారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వనమహోత్సవంలో మొక్క నాటుతున్న హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

హుజూరాబాద్, జూలై11: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. గురువారం వనమహోత్సవంలో భాగంగా బల్దియా ఆఫీసు ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య, మున్సిపల్ ఇన్‌చార్జి ఏఈ సాంబరాజు, ఎన్విరానమెంటల్ ఇంజనీర్ వినయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

గంగాధర, జూలై 11: మండలంలోని బూరుగుపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న విద్యార్థులు 400 మందికి సామాజిక వేత్త తూడి లచ్చయ్య గురువారం మధ్యాహ్నం భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లచ్చయ్యకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ ఎంఈవో అంబటి వేణుకుమార్, నాయకులు సాగి అజయ్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు, టీఎల్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

డైసెస్ కౌన్సిల్ సభ్యుల బాధ్యతల స్వీకరణ

కమాన్‌చౌరస్తా, జూలై 11: చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా కరీంనగర్ డైసెస్ కార్యదర్శి జె శామ్యూల్, కోశాధికారి కేవీ కెనడి గురువారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. దక్షిణ ఇండియా క్రైస్తవ సంఘం అధ్యక్ష మండల పీఠంలో(ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నల్గొండ జిల్లాల పరిధి) ఉన్న చర్చ్‌ల్లో డైసీన్ కౌన్సిల్‌లో 2022-2025 సంవత్సరాలకు ఎన్నికలు 2022లో నిర్వహించారు. కొందరి ఫిర్యాదు మేరకు విచారణ లేకుండా నే, కార్యదర్శి, కోశాధికారిని బిషఫ్ పదవుల నుంచి తొలగించి సభ్యత్వం రద్దు చేశారు. వీరు చెన్నైలోని సౌత్ ఇండియా ప్రధాన కార్యాలయమైన మద్రాసు కోర్టును ఆశ్రయించగా, కేసులో ఎగ్జిక్యూటివ్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పు పడుతూ పదవులను, ప్రాథమిక సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని ఆదేశించింది. కోర్టు ఆర్డర్‌తో ఇద్దరూ ఇన్‌చార్జి బిషప్‌గా భువనగిరిలో ఉన్న సుదర్శన్ కలసి బుధవారం పత్రాలను సమర్పించారు. గురువారం బిషప్ కార్యాలయానికి వచ్చి కార్యాలయ ఇన్‌చార్జి కోర్టు పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో మాలతి, మగ్గిడి విజయారావు, అమృతమ్మ, జాన్ పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

హుజూరాబాద్ రూరల్,జూలై11: విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని గురువారం ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ కొలుగూరి సూర్య కిరణ్ అద్వర్యంలో సీఎంకు పోస్టుకార్డు ద్వారా లేఖలు రాశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. రీయింబర్స్‌మెంట్ రాక పేద విద్యార్థులు చదువులు మానేయాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి బకాయిలు రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో ఏఐఎస్‌బీ నేతలు రాజేశ్, గౌతం, శివకుమార్, రమేశ్,అనిల్, సందీప్, నవీన్, అంజీ, ప్రశాంత్, వినయ్, రోహిత్, సాయికుమార్, అవినాష్, అజయ్, లోకేష్ ఉన్నారు.

పోస్ట్‌కార్డులను చూపుతున్న నాయకులు

బీజేపీ, కాంగ్రెస్ ఫ్లెక్సీ వార్

తిమ్మాపూర్, జూలై 11: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బర్త్ డే సందర్భంగా గురువారం బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఫ్లెక్సీ వార్ నెలకొన్నది. ఆయనకు బర్త్‌డే విషెష్ చెబుతూ బీజేపీ మండలాధ్యక్షుడు జగదీశ్వరాచారి మానకొండూర్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆఫీసు నుంచి వచ్చిన ఇద్దరు అభ్యంతరం చెప్పారు. ఇక్కడ ఫ్లెక్సీ పెడితే ఎమ్మెల్యే సార్ తిడుతాడని అడ్డుకొనేందుకు యత్నించారు. అయి నా బీజేపీ నాయకులు వెనక్కితగ్గలేదు. ఈ వ్యవహారంపై జగదీశ్వరాచారి మాట్లాడుతూ రాజీవ్‌రహదారిపై కేంద్ర మంత్రి ఫ్లెక్సీ పెడితే అడ్డుకోవడం సరికాదన్నారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయవద్దన్నారు.

కేక్ కటింగ్‌లు..రక్తదాన శిబిరాలు

- జిల్లావ్యాప్తంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు
- పెద్దసంఖ్యలో పాల్గొన్న శ్రేణులు

కరీంనగర్ పార్లమెంట్ ఆఫీసు వద్ద నిర్వహించిన క్యాంపులో రక్తదానం చేస్తున్న నాయకులు

విద్యానగర్/చొప్పదండి/ హుజూరాబాద్ జూలై 11: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు గురువారంజిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి స్వీ ట్లు పంపిణీ చేశారు. పలు ప్రాంతాల్లో అ ల్పాహారం, అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ముజీబ్ , జిల్లా అధ్యక్షుడు సమీ పర్వేస్ ఆధ్వర్యంలో కరీంనగర్ దవాఖానలో అన్నదానం చేశారు. టవర్ సర్కిల్ వద్ద కార్పొరేటర్ వంగల శ్రీదేవి పవన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయం తోపాటు జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. వృద్ధా, అనాథ ఆశ్రమాల్లో, దవాఖానల్లో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు నోట్ బుక్ లు, పెన్నులు పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన పలు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాలకు బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చొప్పదండి, హుజూరాబాద్, మానకొం డూర్‌లో కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు.

గంగాధర: బూరుగుపల్లిలో పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, జూలై 11: మహిళాశక్తి కార్యక్రమాన్ని వినియోగించుకొని గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఇందిరా మహిళాశక్తిపై డీఆర్డీఏ, మెప్మా, వ్యవసాయ, పశుసంవర్ధక, పరిశ్రమల శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు తాము నిర్వహించనున్న వ్యాపారంపై అవగాహన కలిగిఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు జిల్లాలో మొదటి సారిగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్కూల్ యూనిఫాంలు కుట్టించి అందజేసినట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా తరగతి గదుల మరమ్మతు పనులు కూడా మహిళా సంఘాల ద్వారా చేపట్టినట్లు వెల్లడించారు. మార్కెట్ పరిస్థితుల కనుగుణంగా మహిళలు తమ వ్యాపారాలను ఎంచుకుంటే పారిశ్రామికవేత్తలుగా ఎదగవచ్చని చెప్పారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో మహిళాశక్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. వ్యాపారం ప్రారంభించే ముందు తమ సంకల్పం గుర్తు చేసుకోవాలని, వ్యాపారం చేయగల సామర్థ్యం, సహకారం, నిజాయతీపై సంపూర్ణ అవగాహన కలిగిఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీధర్, ఎల్డిఎం ఆంజనేయు లు, పరిశ్రమల శాఖ జీఎం నవీన్‌కుమార్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నరేందర్ పాల్గొన్నారు.

మహిళా సంఘాల ప్రతినిధులతో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్, తదితరులు

అంగన్‌వాడీల్లో సభ నిర్వహించాలి

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి శుక్రవారం సభ నిర్వహించాలని, కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చిన్నారులు, మహిళల సమస్యల పరిష్కారం కోసం సభ నిర్వహణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఉద్బోధించారు. అధికారులు క్రమం తప్పకుండా అంగన్‌వాడీ సెంటర్లను తనిఖీ చేయాలన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే సభ ద్వారా వారి పరిధిలోని మహిళల సమస్యలు తెలుసుకుంటే, పరిష్కరించడం సులవని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్‌బాబు, సీపీవో కొ మురయ్య, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీ పీవో రవీందర్, డీఆర్డీవో శ్రీధర్, డీఎంహెచ్‌వో సుజాత, జిల్లా సంక్షేమాధికారి ఎం.సరస్వతి పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి

జిల్లాలో శాఖల వారీగా నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని, కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. వనమహోత్సవంపై కలెక్టరేట్ ఆడిటోరియంలో వివిధ శాఖల అధికారులతో గురువారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామపంచాయితీ, మున్సిపాల్టీల్లో 15 శాతం మొక్కలు మాత్రమే హోంప్లాంటేషన్‌కు కేటాయించాలని, 85 శాతం ఇతరచోట్ల ప్లాంటేషన్ జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మొక్కలు నాటిన వెంటనే జియో ట్యాగింగ్ చేయాలని, నర్సరీ మొక్కలు కాకుండా రైతులు కొనుగోలు చేసి నాటుకునేందుకు సిద్ధంగా ఉంటే, వారికి ప్రభుత్వం నిర్ణయించిన మేరకు మొక్క ఖరీదు కూడా చెల్లించాలని సూచించారు. సకాలంలో ప్లాంటేషన్ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వన మహోత్సవాన్ని జయప్రదం చేయాలి

కరీంనగర్ రూరల్: జలై 11: మొక్కల పెంపకమే లక్ష్యంగా సర్కారు చేపట్టిన వన మహోత్సవాన్ని జయప్రదం చేయాలని కరీంనగర్, ఆర్టీవో మండల ప్రత్యేకాధికారి మహేశ్ కార్యదర్శులు, విలేజ్ స్పెషలాఫిసర్లకు సూచించారు. గురువారం కరీంనగర్ మండల పరిషత్‌లో వారితో ప్ర త్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం అ మలు చేసే పథకాలపై ప్రజలకు అవగాహ న కల్పించాలన్నారు. శుక్రవారం నుంచి ఊరూరా వనమహోత్సవం కింద లక్ష్యం మేరకు 53890 మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. అలాగే మరుగుదొడ్ల నిర్మాణం, శానిటేషన్ పనులపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. తాహెర్‌కొండాపూర్ స్కూల్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వానకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎంపీవోలు జగన్‌మోహన్‌రెడ్డి, శోభ. గ్రామ ప్రత్యేకాధికారులు సత్యం , డాక్టర్ రామకృష్ణ, రమణారెడ్డి ఉన్నారు.

మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి మహేశ్

ప్రజా సమస్యలపై సిద్ధం కావాలి

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

చిగురుమామిడి, జూలై 11: ప్రజా సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వా మి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చిగురుమామిడి సీపీఐ ఆఫీసు ముస్కురాజిరెడ్డి భవన్‌లో పార్టీ మండల కౌన్సిల్ మీటింగ్ గురువారం మండల సహాయ కార్యదర్శి అందె చిన్న స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రాభవం రోజురోజుకూ తగ్గిపోతున్నదని చెప్పారు. తెలంగాణలోనూ ప్రజలకు న్యాయం జరగడంలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలుదాటినా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీల అమల్లో విఫలమైందని మండిపడ్డారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, కార్యవర్గ సభ్యులు బోయిని అశో క్, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మీరెడ్డి, సహాయ కార్యదర్శి అందె చిన్న స్వా మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బూడిద సదాశివ, ముద్రకొల రాజయ్య, మాజీ మండల కార్యదర్శి తేరాల సత్యనారాయణ, మహిళా స మాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు రాకం ఆం జవ్వ, గ్రామ శాఖ కార్యదర్శులు ఉస్మాన్ పాషా, గందె కొమురయ్య, కాత మ ల్లయ్య, అనువోజు జనార్దన్, అందె సం పత్, నేతలు బసంతం, అంజయ్య, రవి, తిరుపతి, సంపత్, వెంకట్ వీరయ్య ఉన్నారు.

డీఈవో ఆకస్మిక తనిఖీ

మానకొండూర్, జూలై 11: మానకొండూర్ బాయ్స్ హైస్కూల్‌ను డీఈవో జనార్దన్‌రావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉచిత దు స్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీ, పిల్లల హాజరుశాతాన్ని పరిశీలించారు. మ ధ్యాహ్న భోజన నిర్వహణపై ఆరా తీ శారు. వెంట ఎంఈవో ఎం మధుసూదనచారి, హెచ్‌ఎం శ్రీనివాస్ ఉన్నారు.

ఢిల్లీ బోనాల ఉత్సవాల్లో ఒగ్గుడోలు కళాకారులు

గంగాధర, జూలై 11: హైదరాబాద్ లాల్ దర్వాజా శ్రీసింహ వాహిని మహాంకాళి ఆలయం, తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో ఈ నెల 9,10 తేదీల్లో బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో గంగాధర మండలం తాడిజెర్రి మల్లికార్జున ఒగ్గుకళా సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు. ఇండియా గేట్ నుంచి తెలంగాణ భవన్ వరకు ఒగ్గుడోలు ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. వీరిని తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అభినందించారు. ఇక్కడ ఒగ్గుకళా సేవా సమితి అధ్యక్షుడు ఈరి మహిపాల్, సభ్యులు గుంట మహేందర్, ఈర్ల గణేశ్, గడ్డం రాము, గంగ శంకర్, అజయ్, వంశీ, శ్రీకాంత్, ఆంజనేయులు, అనిల్, సుమంత్ ఉన్నారు.

జీవో 40ని అమలు చేయాలి

సీనియర్ సిటిజన్స్ డైరెక్టర్ శైలజకు వినతిపత్రం అందజేస్తున్న జనార్దన్‌రావు

కలెక్టరేట్, జూలై 11 : ఇటీవల విడుదలైన జీవో నంబర్ 40ని కలెక్టర్లు కచ్చితంగా అమలు చేయాలని మహిళా, శిశు, ది వ్యాంగ, సీనియర్ సిటిజన్ల శాఖ డైరెక్టర్ బీ శైలజ అన్నారు. గురువారం నగరంలోని అంధుల పాఠశాలలో ఆమెను సీనియర్ సి టిజన్ల ఫోరం జిల్లా శాఖ ప్రతినిధులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భం గా మాట్లాడుతూ, వయోవృద్ధుల ఆస్తులు, ప్రాణ రక్షణపై ప్రత్యేక దృష్టి సారించడమే జీవో నం.40 ఉద్దేశ్యమన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సీనియర్ సిటిజన్ల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని, ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పులు అమలు చేసేలా సం బంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, ప్రతి మూడు నెలలకోసారి సమావేశం కావాల్సిన సీనియర్ సిటిజన్స్ కమిటీ ఏడాది కావస్తున్నా సమావేశం నిర్వహించలేదని సిటిజన్ల ఫోరం జిల్లా అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు ఫిర్యాదు చేశారు. తప్పుడు ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్న కేసులో మోసపోయిన వయోవృద్ధుడు గోరిట్యాల శ్రీనివాస్‌కు న్యాయం చేయాలని కోరారు. అలాగే, గొట్టిముక్కుల వెంకటాచారి అనే వృద్ధుడిపై ట్రిబ్యునల్ తీర్పును అమలు చేయడంలో అధికారుల నిర్లక్ష్యంపై ప్రశ్నించాలని కోరారు. ఇందులో జీఎస్ ఆనంద్, గొట్టిముక్కుల అశోక్, బాధితులు వెంకటాచారి, శ్రీనివాస్ ఉన్నారు.

నిరుపేద అంత్యక్రియలకు ఆర్థిక చేయూత


నగదు అందజేస్తున్న రామకృష్ణ సేవా సమితి బాధ్యులు

చొప్పదండి, జులై11: చొప్పదండికి చెందిన బుర్ర రాజు గురువారం అనారోగ్యం తో మృతి చెందగా అయన అంత్యక్రియలకు పలువురు ఆర్థిక సాయం చేశారు. రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు కొక్కుల కనుకయ్య ఆధ్వర్యంలో రూ.5000 తాటిపెల్లి సతీశ్, తాళ్లపల్లి గంగయ్య, అడిగొప్పుల మహేందర్ , తాటిపల్లి సందీప్ అనుమండ్ల శ్రీనివాస్, మేడి శ్రీనివాస్ రూ. వెయ్యి చొప్పున సిం హాచలం ప్రభాకరాచార్య రూ. 500 ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవాసమితి సభ్యులు సిరిపురం గంగారాం, దూస రామస్వామి గౌడసం ఘం అధ్యక్షుడు పెరుమండ్ల గంగయ్య పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం

ముకరంపుర, జూలై 11: కొత్త డీటీఆర్ పనులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యారణ్య పురి రోడ్డు నంబర్-3 ప్రాంతానికి విద్యుత్ సరఫరా ఉండదని కరీంనగర్ రూరల్ ఏడీఈ కే రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ప్రయాణికుడి హఠాన్మరణం

రామడుగు, జులై 11: జగిత్యాల జిల్లా బతికపల్లికి చెందిన సీహెచ్ రాజయ్య గురువారం ఉదయం కరీంనగర్‌లో ఆర్టీసీ బస్సులో జగిత్యాలకు వెళ్తున్నాడు. బస్సు వెదిర బస్టాప్ వద్దకు చేరుకోగానే ఆకస్మాత్తుగా కుప్పకూలాడు. ప్రయాణికులు రా జయ్య కు సపర్యలు చేసి 108కు సమాచారం అందించారు. హుటాహుటినా వైద్య సిబ్బంది అక్కడికి చేరుకొని సీపీఆర్ చేశారు. అయిన ప్పటికీ రాజయ్య ప్రాణాలువిడిచాడు.

ఇన్‌చార్జి ఏజీపీగా శ్రీనివాస్‌గౌడ్

హుజూరాబాద్ రూరల్,జూలై11: హుజూరాబాద్ సీనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు ఇన్‌చార్జి అసిస్టెంట్ ప్లీడర్‌గా గుర్రం శ్రీనివాస్‌గౌడ్ ను నియమిస్తూ కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. శంకరపట్నానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ గతంలోనూ రెండుసార్లు ఏజీపీగా పనిచేశారు.

విజయవంతం చేయండి

హుజూరాబాద్ రూరల్, జూలై11: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో శుక్రవారం నిర్వహించనున్న వన వన మహోత్సవంలో ప్రజలు పాల్గొని మొక్కలు నాటాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఐలయ్య పిలుపునిచ్చారు. వీణవంక మండలం చల్లూర్, జమ్మికుంట మండలం బిజ్జిగిరి షరీఫ్ దర్గా, ఇల్లందకుంట, కమలాపూర్ ప్రభుత్వ పాఠశాలలు, రంగాపూర్‌లో చేపట్టనున్న కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పాల్గొంటారని వెల్లడించారు.

వైద్య శిబిరం

విద్యానగర్, జూలై 11: కరీంనగర్ మెడికవర్ దవాఖాన ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ వర్క్ షాప్ సమీపంలోని రిలయన్స్ ట్రెండ్స్ సంస్థ ఉద్యోగులకు ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 150 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో మొదలగు పరీక్షలను జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు, ఎమర్జెన్సీ ఫిజీషియన్ డాక్టర్ ప్రకాశ్ వైద్య చేశారు. అలాగే సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెడికవర్ సెంటర్ హెడ్ కిరణ్ మాట్లాడుతూ షాపింగ్ మాల్స్‌లో పనిచేసే ఉద్యోగులు అనారోగ్యానికి గురైతే హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఇక్కడే 24 గంటల పాటు నాణ్యమైన సేవలందిస్తున్నామని వెల్లడించారు. రిలయన్స్ ట్రెండ్స్ మేనేజర్ రోహిదాస్, సూపర్‌వైజర్లు టీ శ్రీనివాస్, పవన్ కళ్యాణ్, నిఖిల్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్ పాల్గొన్నారు.

విచారణ జరిపించాలి

కమాన్‌చౌరస్తా, జూలై 11 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీలో చోటు చేసుకున్న పరిణామాలపై సమగ్ర విచారణ జరపాలని సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక యూనివర్సిటీ గేటు ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్తలు కోట శ్యాంకుమార్, బెల్లపు కరుణాకర్ మాట్లాడుతూ, ఈ నెల 3న యూనివర్సిటీలో జరిగిన సంఘటనలపై ఎంక్వైరీ చేయాలని కోరారు.

హామీలు అమలు చేయాలి

తెలంగాణచౌక్,జూలై11: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం డిమాండ్ చేశారు.నగరంలోని ప్రెస్ భవన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీఏలోకి చేర్చుతామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఏడునెలలు గడుస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. నాయకులు పండుగ బాలు, నర్సయ్య, సురేశ్, భూమేశ్, శరత్ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

శంకరపట్నం, జూలై 11: శంకరపట్నంలో ఎట్టకేలకు గురువారం రోడ్డు ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఎన్‌హెచ్ 563 విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతుండగా, మరో వైపు అధికారులు ప్రధాన రహదారికి ఇరువైపుల ఆనుకుని ఉన్న తాడికల్‌తో పాటు మండల కేంద్రంలో విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. మండలకేంద్రంలో ఎక్స్‌కవేటర్‌తో టేలాలు, తోపుడు బళ్లు, షెడ్లు, నేమ్, డిస్ప్లే బోర్డులు తొలగించారు. గతంలోనే రోడ్డు మధ్య నుంచి 50 ఫీట్ల వరకు మార్కింగ్ చేసినా కొందరి నేతల ఒత్తిడితో ముందుకు కదలలేదు. ఏది ఏమైనా ఆక్రమణల తొలగింపుపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.